సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 31 । జూలై । 2023



అమృత 'ఆహా'ర్ 8లో

ఘోషాస్పత్రికి వచ్చే గర్భిణుల సహాయకులకు రౌండ్ టేబుల్ ఇండియా, స్వామి వివేకానంద సంస్థలు రూ.10కే భోజనం అందిస్తున్నాయి.



టూరిజం బోటు బోల్తా

రుషికొండ బీచ్‌లో పెను ప్రమాదం తప్పింది. అలల ఉధృతికి సముద్రంలో టూరిజం బోటు బోల్తా పడింది. 8లో



ఏఎంసీలో అడ్మిషన్ల సందడి

ఏఎంసీలో అడ్మిషన్ల సందడి నెలకొంది. ఎంబీబీఎస్, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు. 10లో

సీఎం జగన్ నగర పర్యటన రేపు



సాక్షి, విశాఖపట్నం: నగరంలో వివిధ అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగస్టు 1వ తేదీన విశాఖ వస్తున్నారు. ఉదయం 10 గంటలకు గన్నవరం విమానాశ్రయంలో బయలుదేరి 10.45 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 10.55 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 11.15 గంటలకు సాలిగ్రామపురంలో నిర్మించనున్న ఇనార్బిట్‌మాల్ స్థలానికి చేరుకుంటారు. అక్కడ మాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. అనంతరం హైటీలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.20 గంటలకు అదే ప్రాంగణంలో జీవీఎంసీకి చెందిన 50 అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. 12.25 గంటలకు అక్కడి నుంచి రోడ్డుమార్గంలో బయలుదేరి సిరిపురంలోని ఏయూ క్యాంపస్‌కు 12.40 గంటలకు చేరుకుంటారు. ఫార్మా ఇంక్యుబేషన్ సెంటర్(ఎలిమెంట్)తో సహా ఐదు ప్రాజెక్టులకు సంబంధించిన భవనాలను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి 12.50కి బయలుదేరి బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు మధ్యాహ్నం ఒంటి గంటకు చేరుకుంటారు. అక్కడ విశ్వవిద్యాలయం విద్యార్థులతో సీఎం ఇంటరాక్ట్ అవుతారు. మధ్యాహ్నం 1.20 గంటలకు బీచ్‌రోడ్డు నుంచి బయలుదేరి 1.40కు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 1.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి వెళ్లనున్నారు.

'ఇనార్బిట్ మాల్'కు చకచకా ఏర్పాట్లు

తాటిచెట్లపాలెం: సాలగ్రామపురం పోర్టు ఆస్పత్రి సమీపంలో ఇనార్బిట్ మాల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్‌వర్మ, అధికారులతో కలిసి ఆదివారం ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించారు. శంకుస్థాపన ప్రాంగణం, పార్కింగ్, వేదిక, రెస్ట్ రూం తదితర పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పారిశుధ్యం పక్కాగా ఉండాలని, ఎక్కడా వ్యర్థాలు లేకుండా పర్యవేక్షించాలని ఆరోగ్య విభాగం అధికారులకు సూచించారు. ఆయన వెంట జీవీఎంసీ అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు ప్రధాన ఇంజినీర్ రవికృష్ణంరాజు, ప్రజా ఆరోగ్య అధికారి నరేష్ కుమార్, యూసీడీ పీడీ పాపునాయుడు, జోనల్ కమిషనర్లు శివప్రసాద్, ఆర్జీవీ కృష్ణ, మల్లయ్యనాయుడు, సింహాచలం, పర్యవేక్షక ఇంజినీర్లు, ఇనార్బిట్‌మాల్ ప్రతినిధులు ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ







స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా సిరిపురం దత్ ఐలాండ్ జంక్షన్‌లో జీవీఎంసీ ప్రయోగాత్మకంగా తీర్చిదిద్దిన వైజాగ్ స్క్వేర్‌కు నగర ప్రజలు పోటెత్తారు. ఆదివారం కావడంతో ఇక్కడ కాసేపు రిలాక్స్ అయ్యారు. ఇక్కడ ఏర్పాటు చేసిన '#వైజాగ్'తో సెల్ఫీదిగారు. రోడ్డుపై ఆకర్షణీయమైన రంగులు, వ్యర్థాలతో ఏర్పాటు చేసిన ఫర్నిచర్, విద్యుద్దీపాల అలంకరణలు విశేషంగా సందర్శకులను అలరించాయి. వైజాగ్ స్క్వేర్‌కు వచ్చే ప్రజా స్పందన, ట్రాఫిక్ తదితర అంశాలు పరిశీలించి.. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఇటువంటివి ఏర్పాటు చేస్తామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తెలిపారు. - ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్



న్యూస్‌రీల్

వరల్డ్ వర్సిటీ గేమ్స్‌కు అథ్లెట్ జ్యోతి



విశాఖ స్పోర్ట్స్: చైనాలో జరగనున్న వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో పాల్గొనేందుకు హర్డిల్ ఫాస్టెస్ట్ స్ప్రింటర్ జ్యోతి ఎర్రాజీ పయనమైంది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఆరో తేదీ వరకు ఈ పోటీలు జరగనుండగా వంద మీటర్ల వుమెన్ హర్డిల్స్‌లో జ్యోతి పాల్గొనుంది. ఇటీవల ఆసియన్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో వంద మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం సాధించి డబ్ల్యూయూజీలో సత్తా చాటేందుకు సిద్ధమైంది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తరఫున ఈ పోటీల్లో పాల్గొనుంది.

మహిళా పోలీసుల సమస్యలను పరిష్కరించండి



ఎంపీ ఎంవీవీకి వినతి పత్రం అందజేస్తున్న మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మహారాణిపేట : మహిళా పోలీసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. మహిళా పోలీసులకు సరైన జాబ్‌చార్ట్ లేనందున ఇబ్బందులు పడుతున్నామని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మధులత వివరించారు. హోంశాఖ మాతృశాఖగా కొనసాగించడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పటిష్టమైన చట్టం తీసుకురావాలని, తమ సమస్యలను ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తేవాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాధిక, జిల్లా అధ్యక్షురాలు నూర్ జహాన్, ఇతర నాయకులు మాధురి, ఈదురి, రాజాన భవాని, శిరీష, హారిక ఎంపీని కలిసిన వారిలో ఉన్నారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం నిర్వహించనున్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

కొత్తగా 13 డీసీసీబీ శాఖలు

- ఈ ఏడాది వ్యాపార లక్ష్యం రూ.2,500 కోట్లు
- గత సంవత్సరంకంటే 20 శాతం అధికం
- ఖరీఫ్ పంట రుణాలు రూ.450 కోట్లు
- ఆర్బీకేకి ఒక సహకార సంఘం ఏర్పాటు యోచన



విశాఖ డీసీసీబీ భవనం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) సేవలను విస్తృతం చేస్తోంది. ఒక పక్క వ్యాపార లక్ష్యాన్ని పెంచుకుంటోంది. మరోపక్క పంట రుణాలను విస్తరిస్తోంది. ఇప్పటికే వాణిజ్య బ్యాంకులకు దీటుగా లావాదేవీలను కంప్యూటరీకరణ ద్వారా నిర్వహిస్తోంది. ప్రస్తుతం 30 డీసీసీబీ శాఖలున్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 16, అర్బన్‌లో 14 బ్రాంచిలు నడుస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో కొత్తగా 13 డీసీసీబీ శాఖలను ఏర్పాటు చేస్తోంది. విశాఖ జిల్లాలో రెండు (ఆనందపురం, పద్మనాభం), అల్లూరి సీతారామరాజు జిల్లాలో రెండు (పెదబయలు, చింతపల్లి), అనకాపల్లి జిల్లాలో తొమ్మిది (రాంబిల్లి, మాకవరపాలెం, నాతవరం, బుచ్చయ్యపేట, గొలుగొండ, చీడికాడ, కశింకోట, రోలుగుంట, సబ్బవరం) చోట్ల ఏర్పాటుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి అనుమతి లభించింది. వీటిలో ఆనందపురం బ్రాంచిని ఆగస్టు రెండో వారంలోను, పద్మనాభం బ్రాంచిని ఆగస్టు ఆఖరులోనూ ప్రారంభించడానికి డీసీసీబీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కొత్త బ్రాంచిలు అందుబాటులోకి వస్తే విశాఖ డీసీసీబీ శాఖల సంఖ్య 43కు చేరుకుంటుంది. తద్వారా ఆయా ప్రాంతాల రైతులు, వ్యాపారులకు ఈ బ్యాంకు సేవలు మరింత అందుబాటులోకి వచ్చే వీలుంటుంది. డీసీసీబీ బ్రాంచిల్లో రూ.225 కోట్ల వ్యాపారంతో అనకాపల్లి, రూ.200 కోట్లతో చోడవరం, రూ.180 కోట్లతో మాడుగుల శాఖలు ముందంజలో ఉన్నాయి.

వ్యాపార లక్ష్యం రూ.2,500 కోట్లు

విశాఖపట్నం డీసీసీబీ గత (2022–23) ఆర్థిక సంవత్సరం రూ.2,100 కోట్ల వ్యాపార లావాదేవీలను నిర్వహించింది. ఈ సంవత్సరం దానిని రూ.2,500 కోట్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇది గత ఏడాది కంటే 20 శాతం అధికమన్నమాట! గత ఆర్థిక సంవత్సరంలో 55,086 మందికి స్వల్పకాలిక రుణాల కింద రూ.334.79 కోట్లు, దీర్ఘకాలిక రుణాల కింద 125 మందికి రూ.5.70 కోట్లను మంజూరు చేశారు. రైతాంగానికి స్వల్పకాలిక రుణ పథకం కింద 5,431 మందికి రూ.262 కోట్లు, కౌలు రైతులకు 745 మందికి రూ.11.41 కోట్లు, 1.111 స్వయం సహాయక సంఘాలకు రూ.49.86 కోట్ల రుణాలు ఇచ్చారు. ఈ ఏడాది రైతులకు ఖరీఫ్‌లో రూ.450 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించింది. గత ఏడాది ఖరీఫ్ పంట రుణాలతో పోల్చుకుంటే ఇది రూ.116 కోట్లు అధికం. మరోపక్క విశాఖ డీసీసీబీలో రూ.980 కోట్ల డిపాజిట్లున్నాయి. వీటిలో రూ.600 కోట్ల వరకు అర్బన్ పరిధిలో ఉన్న బ్రాంచిల నుంచి వచ్చినవే.

ఆర్బీకేకి ఒక సహకార సంఘం

మరోవైపు ఉమ్మడి విశాఖ జిల్లాలో సహకార సంఘాల సంఖ్యను పెంచాలని డీసీసీబీ యోచిస్తోంది. ప్రస్తుతం 230 వరకు వివిధ రకాల సహకార సంఘాలు ఉన్నాయి. వీటిని రైతు భరోసా కేంద్రానికి ఒకటి చొప్పున 380 వరకు పెంచేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటిని ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై సర్వే చేస్తున్నారు.

సేవలు పెంచి మరింత చేరువ



డీసీసీబీ ద్వారా సేవలు విస్తృతం చేయడం ద్వారా రైతులు, వ్యాపారులకు మరింత చేరువవుతాం. ఇందులో భాగంగానే ఉమ్మడి విశాఖలో కొత్తగా 13 శాఖలను ఏర్పాటు చేయబోతున్నాం. ఈ ఏడాది బ్యాంకు వ్యాపార లక్ష్యాన్ని రూ.2,500 కోట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులకు పంట రుణాలను కూడా పెంచుతున్నాం. రైతులకు పీఏసీఎస్‌ల ద్వారా 7 శాతం వడ్డీతో స్వల్పకాలిక పంట రుణాలిస్తున్నాం. ఏజెన్సీలో ప్రస్తుతం రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీవోలు) ఉన్నాయి. ఇవి ఎంతో విజయవంతంగా నడుస్తున్నాయి. ఈ సంఘాలకిచ్చిన రుణాల రికవరీ 100 శాతం ఉంది. దీంతో వీటిని మరింత విస్తరిస్తున్నాం.

– డీవీఎస్ వర్మ, సీఈవో, డీసీసీబీ, విశాఖపట్నం

ఓటరు జాబితా రూపకల్పనలో అలసత్వం వహించొద్దు

జిల్లా ఎన్నికల బృందానికి కలెక్టర్ మల్లికార్జున ఆదేశం




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం : ఓటర్ల జాబితా రూపకల్పనలో ఏ మాత్రం అలసత్వం ప్రదర్శించినా సహించే ప్రసక్తే లేదని జిల్లా ఎన్నికల బృందానికి కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశించారు. ఆగస్టు 2, 3 తేదీల్లో భారత ఎన్నికల కమిషన్ నిర్వహించనున్న జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్, ఓటరు జాబితా అంశాలపై కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. విశాఖలో జరగనున్న జిల్లా కలెక్టర్ల సదస్సు నాటికి ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌లు బీఎల్వోలతో కలిసి క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పనిచేసి నివేదిక సిద్ధం చేయాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో బూత్ స్థాయి అధికారులు అప్రమత్తతతో పని చేయడం ద్వారా దోషరహిత ఓటర్ల జాబితాలను రూపొందించవచ్చని సూచించారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని ఆదేశించారు. అర్హత ఉన్న18 ఏళ్ల యువతీ యువకులను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు క్షేత్రస్థాయిలో కృషిచేయాలని సూచించారు. సమీక్షలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్ రెడ్డి, ఎస్డీసీలు లక్ష్మారెడ్డి, సత్య పద్మ రామ్మోహన్‌రావు, ఎస్.వెంకటేశ్వరరావు, ఏఈఆర్వోలు, జిల్లా ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మధురవాడ : విశాఖ జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక మధురవాడలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఇల్లాపు వెంకరావు, సెక్రటరీగా ముద్దాడ కిశోర్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా జనార్దనరావు, ట్రెజరరీగా కాశీవిశ్వనాథ్, కార్యవర్గ సభ్యులుగా సురేష్, రాజేష్, దుశ్యంత్, స్వామిలు ఎన్నికయ్యారు. కార్యవర్గ సమావేశానికి పరిశీలకులుగా బానోజీరావు, మురళీలు వ్యవహరించారు. మరింత మందిని క్రీడాకారులను అన్ని రకాలుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని వెంకటరావు చెప్పారు.

విహారికి రావిశాస్త్రి సాహిత్య పురస్కార ప్రదానం



విహారికి పురస్కారం ప్రదానం చేస్తున్న సూర్యారావు, రఘురామారావు తదితరులు


సీతంపేట: ప్రముఖ కవి, కథా రచయిత, విమర్శకుడు జె.ఎస్.మూర్తి (విహారి) రావిశాస్త్రి సాహితీ పురస్కారం 2023 ప్రదానం చేశారు. విశాఖ రసజ్ఞ వేదిక, రావిశాస్త్రి లిటరరీ ట్రస్టు సంయుక్త నిర్వహణలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగిన సభలో రచయిత డి.వి.సూర్యారావు, విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపకులు డాక్టర్ రఘురామారావు, రావిశాస్త్రి తనయుడు ఉమాకుమారశాస్త్రి చేతుల మీదుగా విహారి దంపతులను సత్కరించి పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా డి.వి.సూర్యారావు మాట్లాడుతూ విహారి ప్రాచీన, ఆధునిక సాహిత్య భావనలకు వారిధి అని పేర్కొన్నారు. రావిశాస్త్రి రచనల వైశిష్ట్యాన్ని వివరించి, విహారికి రావిశాస్త్రి సాహితీపురస్కారం ప్రదానం చేయడం సముచితమన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో రావిశాస్త్రి జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రావిశాస్త్రి అక్షర స్ఫూర్తి పుస్తకంలో 'రావిశా మనిషి బొమ్మలు' పేరిట విహారి రాసిన రెండు పేజీల వ్యాసం విశేషంగా ఆకట్టుకుందన్నారు. అప్పటినుంచి విహారిని విశాఖకు రప్పించి అతని ప్రసంగం వినాలని అనుకున్నట్టు తెలిపారు. చివరగా పురస్కార గ్రహీత విహారి తన స్పందనలో రావిశాస్త్రి రచనల్లోని మానవీయ విలువల్ని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రావిశాస్త్రి తనయుడు ఉమాకుమారశాస్త్రి, జె.పి.శర్మ, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఏయూలో ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సీఎం జగన్ పర్యటన ఏర్పాట్లను ఆదివారం వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి పరిశీలించారు. వర్సిటీలో ఐదు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం జగన్ ప్రారంభిస్తారు. అనంతరం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో విద్యార్థులతో ముఖాముఖి ఉంటుంది. వర్సిటీలో ఈ మూడేళ్ల కాలంలో 18 నూతన ప్రాజెక్టులను అభివృద్ధి చేశారు. వీటిని కలెక్టర్ మల్లికార్జున పరిశీలించి ఐదు ప్రాజెక్టులకు ఈ పర్యటనలో భాగంగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఏయూ అధికారులను సూచించారు. ఈ మేరకు టెక్ స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్(ఆ–హబ్), ఫార్మా ఇంక్యుబేషన్(ఎలిమెంట్), ఏయూ డిజిటల్ జోన్, స్మార్ట్ క్లాస్‌రూం కాంప్లెక్స్(అల్గారిథమ్), ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూ సిబ్), ఏయూ అవంతి ఆక్వా కల్చర్ ఇన్నోవేషన్ స్కిల్ హబ్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ ఏర్పాట్లను వీసీ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.



‘వైఎస్సార్ సీపీ వెంటే ఎంబీసీలు’

దాబాగార్డెన్స్: వైఎస్సార్ సీపీ వెంటే ఎంబీసీలున్నారని ఏపీ ఎంబీసీ సంఘాల గౌరవ అధ్యక్షుడు తుమ్మిడి రామ్‌కుమార్ తెలిపారు. ఏపీ ఎంబీసీ సమావేశం ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపంలోని తుమ్మిడి బ్రదర్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు చిన్న, వెనుకబడిన వర్గాల సమూహమే ఎంబీసీలని, రాష్ట్ర జనాభాలో 30 శాతం కంటే ఎక్కువ మంది ఉన్నారని చెప్పారు. రాబోవు ఎన్నికల్లో ఎంబీసీలంతా వైఎస్సార్ సీపీ వెంటే ఉంటారన్నారు. ఎంబీసీలో ఉన్న వారికి ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కారానికి తామున్నామని హామీ ఇచ్చారు. ఎంబీసీలందరూ ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంబీసీలకు పలు నియోజకవర్గాలు కేటాయించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్దామన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు గిడ్డయ్య, ప్రధాన కార్యదర్శి రాంబాబు, కట్టా మల్లేశ్వరరావు, పొన్నాడ మోహన్‌రావు, చిత్రాడ అప్పారావు, ఉప్పు మీరా, అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన హిజ్రాల సంబరాలు



వేడుకల్లో చివరి రోజు హిజ్రాల మాటామంతీ

తాటిచెట్లపాలెం: రైల్వేస్టేషన్ దరి శ్రీనివాస కల్యాణ మండపంలో మూడు రోజులుగా జరుగుతున్న ట్రాన్స్‌జండర్(హిజ్రా)ల సంబరాలు ఆదివారంతో ముగిశాయి. హిజ్రాల సంఘం నాయకుడు సూరాడ ఎల్లాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి హిజ్రాలు తరలివచ్చారు. పలు ప్రత్యేక కార్యక్రమాలు, ఆటపాటలతో ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. హిజ్రాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎల్లాజీ తెలిపారు.

నృత్య కళాకారులకు సత్కారం



చిన్నారిని సత్కరిస్తున్న అతిథులు

సీతమ్మధార: ఏపీ ఎస్సీబీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బహుభాషా నృత్య కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాలల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ విశాఖ చిన్నారులు ఇండోనేషియాలో ప్రదర్శనలివ్వడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం నృత్య కళాకారులు నేహా అక్షయ, సంఘవి, వైష్ణవి, అనురాధను నిర్వాహకులు సత్కరించారు.

అమృత ఆహార్

రూ.10కే కడుపు నిండా భోజనం. ప్రస్తుత రోజుల్లో ఇది వినడానికి కొంచెం ఆశ్చర్యంగానే ఉంటుంది. ఎందుకంటే హోటల్‌లో ఓ ప్లేటు భోజనం తినాలంటే రూ.100కు పైనే అవుతుంది. అంత మొత్తం చెల్లించుకోలేని పేద రోగుల సహాయకులకు వాల్తేర్ రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ చైర్మన్ మక్బూద్ అహ్మద్ సహకారంతో.. స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ రూ.10కే సంతృప్తికర భోజనం అందిస్తోంది. ఎంతో మంది అనాథలు, అభాగ్యులకు ఆశ్రయం కల్పించిన ఈ సంస్థ ‘అన్నం పరబ్రహ్మ స్వరూపం’ అనే నానుడిని నమ్ముతూ.. ఎవరూ ఆకలితో ఉండకూడదన్న భావనతో ముందుకు సాగుతోంది.

– విశాఖపట్నం డెస్క్

- ఘోషాస్పత్రిలో రూ.10కే భోజనం
- అన్నార్తుల సేవలో తరిస్తున్న రౌండ్ టేబుల్ ఇండియా, స్వామి వివేకానంద సేవా సంస్థలు

అభాగ్యుల సేవలో అలుపన్నదే లేకుండా పయనిస్తోంది స్వామి వివేకానంద సంస్థ. కరోనా సమయంలో కూడా కేజీహెచ్‌లోని రోగుల సహాయకులు, జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది, వివిధ రైతుబజార్లలోని స్టాళ్ల నడుపుకునే రైతులకు ఆహారం అందజేసింది. వివేకానంద వృద్ధాశ్రమంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది. సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జహీర్ అహ్మద్ పర్యవేక్షణలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తోంది. కాగా..



కూరగాయలు సిద్ధం చేస్తున్న మహిళలు

రుచిగా.. శుచిగా..



అన్నార్తుల కోసం తయారు చేసే ఆహారం రుచిగా, శుచిగా ఉండాలన్నది సంస్థ లక్ష్యం. అందుకే ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ‘అమ్మవంట’ నూకాలమ్మ పర్యవేక్షణలో వివేకానంద సేవా సంస్థకు చెందిన మహిళలు వంట చేస్తున్నారు. వంట చేసే ప్రాంతంలోనే హరినామ సంకీర్తన చేస్తూ.. భోజనాన్ని శుభ్రంగా ప్యాక్ చేస్తారు. ఆటోలో ఘోషాస్పత్రికి తీసుకొచ్చి రోగుల సహాయకులకు అందజేస్తున్నారు.

ఘోషాస్పత్రికి ప్రసవాల నిమిత్తం దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి సరైన భోజనం లేక ఇబ్బంది పడుతున్నట్లు సంస్థ గుర్తించింది. రోగుల సహాయకులకు అతి తక్కువ ధరకే ఆహారం అందించాలని సంకల్పించింది. ఫలితంగా ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి రూ.10కే భోజనం అందించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వాల్తేరు రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ చైర్మన్ మక్బూద్ అహ్మద్ సహకారంతో 150 రోజులకు పైగా ఘోషాస్పత్రిలో రోగుల సహాయకులకు ఆహారం అందజేస్తోంది. ‘అమృతాహార్’ పేరిట అందిస్తున్న ఈ భోజనం నిజంగానే అమృతంలా ఉందని రోగుల సహాయకులు కొనియాడుతున్నారు. తొలుత ఇక్కడ రోజుకు 100 మందికి ఆహారం అందించే వారు. క్రమంగా ఈ సంఖ్య పెరగడంతో 120కి పెంచారు. ఇంకా అవసరం అనుకుంటే ఈ సంఖ్యను మరింత పెంచుతామని వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తెలిపారు. రోగుల సహాయకులు హోటళ్లలో అధిక ధరలు చెల్లించి ఆహారం కొనుగోలు చేయలేకపోవడం, ఇక్కడ క్యాంటీన్ సదుపాయం కూడా లేకపోవడం వల్ల ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. దాతలు ముందుకొస్తే.. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం కూడా అందజేసేందుకు ప్రయత్నిస్తామని వెల్లడించారు.

భోజనం ప్యాకెట్లు అందిస్తున్న మక్బూద్ అహ్మద్



ప్రతీ 50 రోజులకు ఓసారి రూ.10కే బిర్యానీ



రోగుల సహాయకులకు రుచి, శుచికరమైన భోజనం అందించేందుకు మంచి రకం బియ్యం, నూనె వాడుతున్నాం. గ్యాస్‌తో కాకుండా ప్రత్యేకంగా తయారు చేసిన కట్టెల పొయ్యి మీద వంట చేస్తున్నాం. ఆ పొయ్యి ఖరీదు రూ.1.80 లక్షలు. ఈ కార్యక్రమానికి డి.సత్యనారాయణ, సీహెచ్ పోతురాజు, ఉమాదేవి, రాణి, సుజాత, భవానీ, నాగమణి, రత్న, అచ్యుత, కనకమహాలక్ష్మి, డి.సత్యనారాయణ స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. ప్రతీ 50 రోజులకు ఒకసారి రోగుల సహాయకులకు రూ.10కే బిర్యానీ అందజేస్తున్నాం.

– సూరాడ అప్పారావు, అధ్యక్షుడు, స్వామి వివేకానంద సంస్థ

భోజనం బాగుంది



మా పాప డెలివరీ కోసం ఘోషాస్పత్రికి వచ్చాం. బయట మూడు పూటలా భోజనం కొనుక్కుని తినలేకపోతున్న సమయంలో.. ఇక్కడ రూ.10కే ఇస్తారని తెలిసిన వాళ్లు చెప్పారు. రెండు రోజులుగా ఇక్కడికి వచ్చి భోజనం తీసుకెళ్తున్నాను. భోజనం శుభ్రంగా.. ఇంట్లో చేసినట్లే ఉంది. నిర్వాహకులకు ధన్యవాదాలు.

– పద్మ, సింహాచలం

తక్కువ ధరకే మంచి భోజనం



మా అమ్మాయి ప్రసవం కోసం ఈ ఆస్పత్రికి వచ్చాం. ఇక్కడ రూ.10కే భోజనం ఇస్తున్నారని తెలిసి రెండు రోజులుగా తీసుకుంటున్నాను. భోజనం చాలా బాగుంది. ఈ రోజుల్లో పది రూపాయలకు ఏం వస్తుంది? ఇంత చక్కటి భోజనం తక్కువ ధరకే ఇస్తున్న వారు ధన్యులు.

– దానీలు, జెండాచెట్టువీధి

పుణ్యమంతా వీళ్లదే..



మా మనవరాలు డెలివరీకి ఇక్కడికి వచ్చాం. ఇక్కడ రూ.10కే భోజనం పెడుతున్నారని తెలుసుకుని వచ్చాను. భోజనం చాలా బాగుంది. పుణ్యమంతా వీళ్లదే. ఉదయం, రాత్రి కూడా తక్కువ ధరకే ఆహారం ఇస్తే బాగుంటుంది.

– నక్కా సూరి అప్పాయమ్మ, మధురవాడ

రూ.10కే భోజనం.. గొప్ప విషయం



మాది దిబ్బపాలెం. పాప డెలివరీ కోసం ఇక్కడికి వచ్చాం. ఇక్కడ రూ.10కు భోజనం తీసుకుంటున్నాం. చాలా బాగుంది. రుచిగానే కాదు శుభ్రంగానూ ఉంది. పది రూపాయలకే ఇంత మంచి భోజనం పెడుతున్నారంటే గొప్ప విషయమే.

– వి. గౌరీ, దిబ్బపాలెం

పేదలకు ఉపయోగకరం



మా కోడలి పురిటికి ఇక్కడికి వచ్చాం. ఇక్కడంతా ఏం తెలియదు. భోజనానికి ఇబ్బంది పడుతుంటే ఎవరో ఇక్కడ రూ.10కే మంచి భోజనం పెడుతున్నారని చెప్పారు. రెండు రోజులుగా ఈ భోజనం తింటున్నాం. చాలా బాగుంది. పేదలకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

–పిరిడి అప్పలనాయుడు, ఎస్.కోట

అన్నీ ప్రత్యేకమైన ప్యాక్‌లో..



వీలున్నప్పుడల్లా ఇక్కడ భోజనం చేస్తుంటాను. చాలా బాగుంటుంది. చక్కని ప్యాకింగ్‌లో భోజనం తీసుకొచ్చి అందజేస్తారు. పేషెంట్ల సహాయకులు ఇక్కడే ఏ చెట్టు కిందో కూర్చుని భోజనం చేస్తారు. అన్నం, కూరలు, సాంబారు అన్నీ ప్రత్యేకంగా ప్యాక్ చేయటం వల్ల సులువుగా శుభ్రం చేసుకునే వీలుంది.

–డి.గణేష్, స్వీపర్, ఘోషాస్పత్రి

టూరిజం బోటు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం
- రుషికొండ బీచ్‌లో ఘటన



బోటును తీరానికి తీసుకుని వస్తున్న లైఫ్ గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో పెను ప్రమాదం తప్పింది. ఇద్దరు సందర్శకులు బోటులో జాలీగా షికారు చేస్తుండగా.. అలల ఉధృతికి సముద్రంలో బోటు బోల్తా పడింది. వీరు లైఫ్‌జాకెట్లు వేసుకోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. పోలీసులు, పర్యాటకులు తెలిపిన వివరాలివీ.. చినముషిడివాడకు చెందిన ఇంటి రవి, మధురవాడకు చెందిన బొత్స సురేష్ ఆదివారం రుషికొండ బీచ్‌కు వచ్చారు. సముద్రంలో షికారు చేసేందుకు టూరిజం బోటు ఎక్కారు. బోటులో షికారు చేస్తున్న సమయంలో అలల ఉధృతి ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో ఓ భారీ అల బోటును ఢీ కొట్టడంతో.. బోల్తా పడింది. ఈ ఘటనలో వీరిద్దరితో పాటు బోటును నడుపుతున్న పుక్కళ్ల లక్ష్మణరావు సముద్రంలో పడిపోయాడు. వీరు లైఫ్ జాకెట్లు వేసుకోవడంతో పెను ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ఇది గమనించిన లైఫ్‌గార్డ్స్ వెంటనే ఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని పర్యాటకులు, బోటును సురక్షితంగా తీరానికి తీసుకొచ్చారు. ఎటువంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న మెరైన్ పోలీసులు బీచ్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. కాగా.. వారం రోజులుగా అలలు ఉధృతి ఎక్కువగా ఉంది. దీనికి తోడు బలంగా గాలులు వీస్తున్నాయి. ఈ సమయంలో బోటు షికారు నిర్వహించడంపై పలువురు మండిపడుతున్నారు.

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న చిట్టిబాబు

కూర్మన్నపాలెం: భార్య మాటలకు మనస్తాపం చెందిన భర్త చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 88వ వార్డు పరిధి మంగళపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఓదూరి చిట్టిబాబు(43) భార్య నూకరత్నం, కుమారుడితో కలిసి ఉంటున్నాడు. తన బావమరిది కూడా తమతో పాటు ఇంట్లో ఉండడం ఇష్టంలేని చిట్టిబాబు.. తరచూ భార్య, బావమరిదితో గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం బావ, బావమరిది ఇరువురూ మద్యం సేవించడంతో గొడవ జరిగింది. ‘మీ తమ్ముడు ఇంట్లో ఉండటానికి వీల్లేదు. వెంటనే పంపించే’ అని భార్య నూకరత్నంపై చిట్టిబాబు ఒత్తిడి చేశాడు. దీంతో నూకరత్నం ‘మా తమ్ముడు ఎక్కడికీ వెళ్లడు.. నీకు ఉండాలనిపిస్తే ఉండు.. లేకపోతే నువ్వే ఇంట్లో నుంచి వెళ్లిపో’ అని కోపంగా మాట్లాడింది. ఆమె మాటలకు మనస్తాపానికి గురైన చిట్టిబాబు నా మాటకు విలువ లేనప్పుడు నేనెందుకు బతకాలని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మృతుడు చిట్టిబాబు ఆటోనగర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వర్తిస్తున్నాడు.

మూలకుద్దు సర్పంచ్ పార్వతి కన్నుమూత



తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు పంచాయతీ సర్పంచ్ కొల్లి పార్వతి(63) ఆదివారం వేకువజామున గుండెపోటుతో మరణించారు. శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఒంట్లో నలతగా ఉన్నట్టు ఆమె భర్త అప్పలరెడ్డికి చెప్పారు. వేకువజామున 3 గంటల సమయంలో ఆయాసం రావడంతో వెంటనే సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుతో ఆమె మరణించారు. 2021లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ఆమె విజయం సాధించారు. 2005లో వార్డు సభ్యురాలిగా కూడా పనిచేశారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు కోటిరెడ్డి అన్నారు. ఆయన వైఎస్సార్ సీపీ నాయకుడు. ఆమె భౌతికకాయానికి భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నివాళులు అర్పించారు.

ఉక్కు విశ్రాంత డైరెక్టర్ ఎస్.కె.ఎస్.నారాయణ్ మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విశ్రాంత డైరెక్టర్ (కమర్షియల్) ఎస్.కె.నారాయణ్ ఆదివారం సాయంత్రం భువనేశ్వర్‌లో మృతి చెందారు. కనిష్ట స్థాయిలో స్టీల్‌ప్లాంట్‌లో చేరిన నారాయణ్ అంచెలంచెలుగా ఎదిగి టాలెంటెడ్, డైనమిక్ అధికారిగా పేరెన్నికగన్నారు. మొదటి ఈడీ(వర్క్స్)గా బాధ్యతలు స్వీకరించిన నారాయణ్ 1997లో డైరెక్టర్ (కమర్షియల్)గా ఎంపికయ్యారు. 2003 జూలై 31న పదవీ విరమణ చేసిన సరిగ్గా పదేళ్లకు ఒక రోజు ముందు మృతి చెందడం బాధాకరం. ఆయన మృతి పట్ల ఉక్కు వర్గాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.

‘క్లాసిక్’ ఫ్యాషన్ షో అదుర్స్



స్టార్ ఆంధ్రప్రదేశ్-2023 పోటీల్లో పాల్గొన్న యువతీయువకులు

దాబాగార్డెన్స్: నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన స్టార్ కిడ్స్-2023, స్టార్ ఆంధ్రప్రదేశ్-2023 ఫ్యాషన్ షో పోటీలు అదుర్స్ అనిపించాయి. క్లాసిక్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రెండు విభాగాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 68 మంది మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. వీరిలో ఫైనల్స్‌కు చేరిన వారి మధ్య ఉత్సాహభరితంగా పోటీ సాగింది. విజేతలకు బిగ్ బాస్ ఫేం అనీల్ రాథోడ్, న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన మిస్టర్ ఒలింపియా అరుణ్‌పాల్, మిస్ ఇండియా–2022 సంతోషిని చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. స్టార్ ఆంధ్రప్రదేశ్ సీజన్ పోటీల్లో భాగంగా నిర్వహించిన ఫ్యాషన్ షోలో వేలాది మంది యువతీ యువకులు ఆడిషన్స్‌కు వచ్చారని.. కేవలం 64 మందిని మాత్రమే ఎంపిక చేశామని నిర్వాహకులు నందిని గొల్లూరి, సువ్వాడ రోహిత్ తెలిపారు. ఈ సందర్భంగా చిన్నారులు ఫ్యాషన్ దుస్తులతో, మహిళలు సంప్రదాయ చీరకట్టు, పాశ్చాత్య వస్త్రధారణతో తమదైన శైలిలో ర్యాంప్ వాక్ చేశారు.

నేడు కోర్టుల బహిష్కరణ

విశాఖలీగల్ : విజయవాడ న్యాయవాదుల సంఘానికి చెందిన న్యాయవాది ఆర్.ఆదిశేషు విఠల్‌బాబు దారుణ హత్యను విశాఖ న్యాయవాదుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు విశాఖ న్యాయవాదుల సంఘం కార్యదర్శి పైలా శ్రీనివాసరావు ఓ ప్రకటన విడుదల చేశారు. విశాఖ న్యాయవాదుల సంఘం పిలుపు మేరకు సోమవారం కోర్టులను బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. దీనికి న్యాయవాదులు అంతా సహకరించాలని కోరారు.

కళాకారుల సంఘం అధ్యక్షురాలిగా విజయ



నూతన కార్యవర్గంతో కళాకారులు

బీచ్‌రోడ్డు: విశాఖ సకల కళాకారుల సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం సిరిపురం బిల్డర్స్ అసోసియేషన్ హాలులో సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో జరిగాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షురాలిగా ప్రముఖ రచయిత్రి డాక్టర్ జాలాది విజయ, ఉపాధ్యక్షుడిగా ఎం.త్రినాథరావు, కార్యదర్శిగా గాయకుడు కె.లోకేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా గెంబలి జగదీశ్, కోశాధికారిగా వ్యాఖ్యాత మధుపాడ రమణి విజయం సాధించారు. ఎన్నికల అధికారులుగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, మేడా మస్తాన్ రెడ్డి వ్యవహరించారు. ఎన్నికల కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ సంగీతం, సాహిత్యం, గానం, నృత్యం, నాటకం తదితర అంశాలకు చెందిన సకల కళాకారులతో సంఘం ఏర్పాటైందన్నారు. ఎన్నికైన వారు రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగుతారన్నారు. విజేతలకు ఎన్నికల అధికారుల నియామకపత్రాలు అందజేసి సన్మానించారు. కళాకారులు జె.ఎం.ఆర్ నెహ్రూ, పి.ఎ. భాస్కరరావు, వీఎం గోపాలరావు, ఫణిస్వామి, కె.ఎస్. ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు



నడక పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కంచరపాలెం: కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీ స్టార్స్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఆర్ఆర్ఎస్ మహేశ్వరరావు నేతృత్వంలో రౌతు ఆదినారాయణ స్మారక జిల్లా స్థాయి నడక పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథి వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 గవర్నర్ యు.శుభ జెండా ఊపి ఈ పోటీలను ప్రారంభించారు. 30 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయసు గల మహిళలు, పురుషులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. ముందుగా ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్ దాస్, సామాజిక సంఘ సంస్కర్త, ఆధ్యాత్మిక వేత్త రౌతు ఆదినారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నడక పోటీల్లో విజేతలకు ఆగస్టు 15న జరిగే వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు. క్లబ్ ఉపాధ్యక్షుడు గుమ్మిడి అచ్చిబాబు, కార్యదర్శి సత్యనారాయణ, ప్రకాశరావు, సానా అప్పారావు, రవీంద్ర బెహరా, ఎల్.వి.సుధాకర్, వెంకట అప్పారావు, బలరామ్, వెంకటేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, త్రీ స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకుడు జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల విజేత తిరుపతి



తృతీయ స్థానం సాధించిన అనకాపల్లి, విశాఖ జిల్లాల జట్లు

- అనంతపురానికి ద్వితీయ స్థానం
- తృతీయ స్థానంలో నిలిచిన అనకాపల్లి, విశాఖ జిల్లాలు

అనకాపల్లి టౌన్: విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జాతీయ గ్రాప్లింగ్ (కుస్తీ పోటీలు) అసోసియేషన్ చైర్మన్ దినేష్‌కుపూర్ తెలిపారు. స్థానిక గవరపాలెం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి మూడో సబ్ జూనియర్ గ్రాప్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలపై ప్రత్యేక దృష్టి సారించాయని, విద్యార్థులు వారికి నచ్చిన దాంట్లో ప్రతిభ సాధించాలని సూచించారు. విద్యతోపాటు, క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పొందవచ్చని చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన 600 మంది క్రీడాకారుల పాల్గొన్నారు. తిరుపతి జిల్లా ప్రథమ స్థానం, అనంతపురం జిల్లా ద్వితీయ, అనకాపల్లి, విశాఖ జిల్లాలు తృతీయ స్థానం సాధించాయి. పోటీలు అనంతరం విజేత క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు పద్మనాభం, సీనియర్ క్రీడాకారులు లక్ష్మణరావు, కె.ఎస్.వి.సత్యనారాయణ, గ్రాప్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.జ్యోతిర్మయి, క్రీడాకారులు పాల్గొన్నారు.